# హాశ్య నాటిక

## తెలుగు గడ్డ


**రచయిత**

**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**



**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్, హైదరాబాదు - 500 084.

ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

**HASYA NATIKA**

(A Telugu Drama)

by **Dr.Nanduri Ramakrishnamacharya**

ప్రథమ ముద్రణ : 1977 (2000 ప్రతులు )

పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్
హైదరాబాద్ -500084. Cell -9440495887.

: 2. నండూరి విద్యారణ్య స్వామి , ప్లాట్ నం .:154,
స్ప్రింగ్ విల్లా, జర్నలిస్ట్ కాలనీ, నిజాం పేట
హైదరాబాద్ -500090. Cell -9391028231 .

వెల : రూ.60/-.

సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# హాశ్య నాటిక

## తెలుగు గడ్డ

### భూమికలు

1. శ్రీరాముడు
2. సీత
3. లక్ష్మణుడు
4. దేవేంద్రుడు
5. నారదుడు
6. తిలోత్తమ
7. ఆంధ్రుడు
8. విశాలాంధ్రుడు
9. బృహస్పతి

# తెలుగు గడ్డ

ప్రథమ దృశ్యం

ప్రవేశం: సీతా రామ లక్ష్మణులు.

స్థలం: దండకారణ్యం - గోదావరీ ప్రాంతం.

సీత - రాముడు: 'చల్ మోహనరంగా నీకు నాకు జోడు కలిసెను గదరా!

శ్రీరాముడు: తమ్ముడూ' లక్ష్మణా !

లక్ష్మ: దాసానుదాసుడు, రామానుజుడు, లక్ష్మణుడు నమస్కారము చేస్తున్నాడు. అడియేన్,

శ్రీరాముడు: ఓ లక్ష్మణా! హే ప్రియసోదరా! అనుగు తమ్ముడూ! మై డియర్ బ్రదర్! ఛోటా భాయీ! నల్లతంబీ! లే, ఏమీ నీ మొగం అట్లా వేలాడపేశావ్? లే, నీ మొగం అట్లావుంటే నా గుండె చెఱువై పోతుంది. రామ సాగరమైపోతుంది!

లక్ష్మ: మనం పితృవాక్యపరిపాలనకై యీ యీ దండకారణ్యంలో తిరుగు లాడవలసివచ్చిందికదా, ఇదేమంత ఘన కార్యమా! అని...

శ్రీరా: ఆఁ! మనం అయోధ్య విడిచి అరణ్యాల పాలయింది దేనికి?-మన పేరు చరిత్రలో, పురాణాలలో శాశ్వతంగా సువర్ణాక్షరాలతో నిలిచి పోతుంది! పగటి కలలు కనే కవులు మనకు సమస్త కల్యాణ గుణ గణాలు కల్పించి తెగ వ్రాసేసి గ్రంథకర్తలయిపోయి, ఊరేగుతారు, ప్రజల్ని ఉవ్విళ్ళూరిస్తారు.

రామువంటి కొడుకు! భరత సౌమిత్రులవంటి

తమ్ములు ! సీతవంటి భార్య! లేరు లేరటంచు!

ముందు యుగముల పురుషులు తలలూప

వలదే! కష్టసుఖములు మనకు శాశ్వతములె!

లక్ష్మ: ముందు యుగములవారి తలతిరుగుడువల్ల మనకు లాభం ఏమిటి? మనం ముందు యుగాల వారికోసం ఎందుకు కష్టపడాలి? ముందు యుగాలవారు మన కేమైనా చేస్తారా?

శ్రీరా : అట్లా అనగూడదురా! ప్రియసోదరా!

సకల కల్యాణ సద్గుణభద్రుడై న

నన్ను - నరులు దేముని గాగ అరయుగాక!

పది కొంపలును లేని పల్లెటూరున గూడ

రామాలయ మొకండు వెలయుగాక!

లక్ష్మ: ఏమో - రాముడు, గీముడు, దేముడూ అంటే నమ్మకం లేని కామ్రేడ్ సోదరులు కలియుగంలో పుట్టుతారని దేముడైన నీకు తెలియదురా బ్రదర్ !

శ్రీరా: లే లక్ష్మణా! నీ నోట ఎన్నడూ వినని మాటలు వింటున్నాను, పోదాం లే.

లక్ష్మ: నేనిప్పుడు చచ్చినా లేవలేను, ఇదిగో అన్నయ్యా, చెప్పుతున్నాను వినే సెయ్యి. వచ్చేది కలియుగం! అప్పుడు ధర్మం ఒంటి కాలిమీదనే నిలువ గలుగుతుంది! అక్కడ అన్నగారూ - తమ్ముడూ, భర్తా భార్యా, ధనికుడు - దరిద్రుడు, తెలివిగలవాడు - తెలివితక్కువవాడు, స్త్రీ - పురుషుడూ, అన్న భేదాలు పోయి సర్వమానవ సమత్వం ఏర్పడుతుంది.

శ్రీరా: తమ్ముడూ! ఏమిటి నీ వింతధోరణి? చూడు జానకీ! మదీయానుజుని నాలుక పై ఎట్టి వింత బాస – పలుకుబడులు - చిన్నారి నా నుడులు చిందులాటలాడుచున్నవో! కనుంగొంటివే! హే ప్రేయసీ!

సీతః మిస్టర్ లక్ష్మణుడు చెప్పేమాటలలో ఎంతో సత్యం దోబూచులాడుతూ వుంది. అన్నగారైనంత మాత్రాన! ఏదో ఒకటి రెండు సంవత్సరాలు ముందు పుట్టటం చేత! ఇక తమ్ముడి చేత వెట్టి చాకిరీ చేయించుకోటమే! ఎవరిచ్చారండీ పిన్నవాళ్ళమీద పెద్దలకు ఈ అధికారం?

లక్ష్మ: వినుడు - వినుడు - వదినా! ఎంత బాగా చెప్పేశావమ్మా ! ప్రపంచంలోని తమ్ముళ్ళారా! ఏకం గావాలి, ఏకం గావాలి! ఏకంగండు, విప్లవం వర్ధిల్లుగాక ! పెద్దల పెత్తనం నశించాలి.

శ్రీరా : ఇదేమిటీ!

లక్ష్మ: డామిట్ - ఏమిటీ లేదు - గీమిటీ లేదు. పెద్దల పెత్తనం నశించాలి. ఇదుగో అన్నయ్యా, నా కిప్పటికి జ్ఞానోదయం అయింది. నీవు, నీ భార్యా, 'చల్ మోహన రంగా' యని చిలకా గోరింకల్లాగ రాజసంతో ముందు మంద గంభీరయానం సాగిస్తోంటే - నన్ను నీ బట్టలూ, మీ ఆవిడ చీరలూ మోయటానికే భగవంతుడు పుట్టించా డనుకున్నావా? ఇవిగో నీ బట్టలూ! మీ ఆవిడ చీరలూ! ఇకమీద నీవే మోయాలి - జాగ్రత్త! ప్రపంచ తమ్ముల్లాగా! ఏకముగండు. పెద్దల పెత్తనం నశించుగాక! చిరంజీవినీ సౌభాగ్యవతీ విప్లవం వర్దిల్లుగాక

శ్రీరా: (తనలో) నే నెవ్వరితో మొఱు పెట్టుకునేది? అయ్యో! మానవులు భగ వంతునితో మొరపెట్టుకుంటారు. నేనే భగవంతుణ్ణిగదా! నా తమ్ముడు ఇట్లా ఎందుకు అంటున్నదీ భగవంతుణ్ణి కాబట్టి నాకే తెలియాలి. కాని నేను మాయామానుష విగ్రహం దాల్చి భూమిమీద పుట్టాను. కాబట్టి తెలుసుకోకూడదుకదా, తెలుసుకోను. ఇప్పుడుమాయ నన్ను చుట్టుకొని యున్నది. అజ్ఞానం భగవంతుని సోదరుని చుట్టుకొని వున్నది! హా, ప్రేయసీ! లక్ష్మణుని నుండి మూటలు నీవు తీసుకో.

సీత: నేనా! నీ మూటలు మోస్తూ, అంట్లు తోముతూ నీకు దాసిగా ఉండ వలసింది? అందుకేనా జనకమహారాజు నీకు నన్నిచ్చింది, మిష్టర్ రామూ!

శ్రీరా: ఆఁ ఆఁ! సీతామహాదేవి నోటినుండేనా! ఈ మాట!

సీత: ఇక కలియుగంలో అందరు స్త్రీలు భర్తవెంట నీడలాగ, క్రీనీడలాగ అణగి మణగి ఉంటారనుకోకండి. భార్యను దాసీలాగ వాడుకోడానికిభర్తకు ఎవ రధికారం ఇచ్చారు? కలియుగంలో స్త్రీ పురుషుడికి దాసిగా ఉండదు. ప్రపంచ భార్యల్లారా! ఏకముగండి! భర్తల అధి కారం నశించాలి! భార్యలకు భర్తలతో సమానహక్కులు ఏర్పడేవరకు  ఏ ఒక్క స్త్రీ నిద్రపోదు. ఏ స్త్రీ పురుషుడితో మాట్లాడకూడదు. పురుషుల సామ్రాజ్యవాదం నశించాలి!

శ్రీరా: సీతాదేవి నోటివెంట ఎటువంటి మాటలు వినవలసి వచ్చింది!

సీత: ప్రపంచ మహిళల్లారా! ఏకముగండి, చిరంజీవినులు, సువాసినులు, పూర్వసువాసినులు, సౌభాగ్యవతులు, గంగా భాగీరథీ సమానులూ అందరూ ఏకమై పురుషసామ్రాజ్యవాదం అంత మొందించాలి. ఇంత వరకు అడుగున పడియున్న స్త్రీలు అంతా ఇకమీద పైకిరావాలి.

శ్రీరా: మహాపతివ్రత మహీసుత మాటలేనా ఇవి?

సీత: మహాపతివ్రత అంటే - పురుషుడు స్త్రీని శాశ్వతంగా బానిస చేయడం కోసం భారతదేశం కనిపెట్టిన సుకుమార ద్రోహం, "పతివ్రక" అనేమాట భారతసాహిత్యానికి శాశ్వత కళంకం. పురుషులు పత్నీ వ్రతు లెందుకు కాకూడదు?

శ్రీరా: నాకంటే గొప్ప ఏకపత్నీవ్రతుడి ప్రపంచంలో ఎవ్వరు? అదీగాక సృష్టిలో స్త్రీ పురుషులకు కొన్ని కృత్యాలున్నాయి. స్త్రీ పురుష సమానత్వం అంటే మగవాళ్ళు పిల్లలను కనలేరుగదా?

సీత: ఎందుచేత? ఆడవాళ్ళు ఆడపిల్లలను కంటారు; మగవాళ్ళు మగపిల్లలను కనాలి. కంటే మంచిదికూడా.

శ్రీరా: ఓ లలితేంద్ర నీల శక లోపమ కైశిక! ఇంతవంత నీకేల? నీతో నేను వాదింపగలనా - నన్ను కటాక్షించి నా పరువు కాపాడుము దేవీ! ఈ సంగతి ఎవరికైనా తెలిస్తే ఎంత సిగ్గు చేటు - నీ మృదు పాద పల్లవములపై నా శిరస్సు మోపి నీకు సాష్టాంగ దండ ప్రణామము చేయుచున్నాను—నన్ను కరుణింపుము - దేవీ !

(శ్రీరాముడు సీత పాదాలపై పడిపోవును)

సీత: ఈ మగవాళ్ళను స్త్రీ జాతి ఎన్నటికీ నమ్మరాదు. వీళ్ళ పౌరుషం బింకం ఇంతే - అందతే జుట్టు - అందకపోతే కాళ్లూ! (తనలో) అయితే - ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి? శాస్త్ర ప్రకారము ఈతనిని నా యెడమకాలితో తన్నవలెనుగదా! తన్నుదునా? మానుదునా? హత విధీ! నా హృదయమునకు ఎట్టి ఘోర పరీక్ష తెచ్చి పెట్టితివి? సరే! ఇతని శిరస్సును తన్నక తప్పదు. ఒక వేళ తన్నినచో ఇతని మొరటు తలకాయ తగిలి సుకుమారమైన మదీయ పదపల్లవము నొచ్చు నేమో! అందుచేత తన్నను. (ప్రకాశముగా ! ) మిష్టర్ రామూ! పురుషుల కుహనా శృంగార చేష్టలకు అళీక ప్రణయ నటనలకు ఇకమీద లీలావతులు ఎవ్వరూ లొంగిపోరు. నిన్ను తన్నకుండా కరుణించి వదలివేశితిని - ఇక లెమ్ము' నీ మూటలు నేను మోయజాలను-తెలిసిందా!

శ్రీరా : బాగుంది, నా మతిపోతుంది సరే, లక్ష్మణా! ఆమూట లిట్లా పారెయ్యి, నేనే మోస్తా. రండి పోదాం.

(-రాముడు మూటలు మోస్తూ బయల్దేరుతాడు-)

అదె గోదావరి! పాఱుచున్నయది బ్రహ్మాండంబుగా భార్య రో!
ఇదెపో దండక! మత్త చిత్త కరిణీ హేవాక నీవాకమై
పొదివెన్; మూగిన ఆంధకోతు లిటు రువ్వున్ రాళ్లటుల్ చూచినన్!
ముదితా ! కోతులఁజూచి సిగ్గిలుట ఇంపున్ గూర్చు నా కెంతయున్.

లక్ష్మ: ఈ సప్తగోదావర మెంత రమ్యముగా నున్నది!

సీత: అఖండగౌతమి ఏడుపాయలై తేనేగాని అందంగా కనిపించటం లేదు. గాబోలు మఱది గారికి.

లక్ష్మ: డామిట్! ఐకమత్యమంటే - హాస్యాస్పదంగా ఉందిప్పుడు నాకు!

సీత: ఎట్లాగో ఈ పడవమీద గోదావరి దాటుతున్నాం, సంతోషం.

(ఛాయాసంచలనం: సీతారామలక్ష్మణులు - గోదావరిలో పడవ ప్రయాణం)

పాట : ఎత్తరా తెఱచాప! విప్పరా నీ గొంతు!
నెట్టరా నీ పడవ! పట్టరా చుక్కాని!

చుట్టరా తలపాగ! కట్టరా నీ నడుము!

ఏ క్రొత్త క్షితిజమో! ఏ నూత్న లోకమో!

ఏ నవయుగోదయమొ! ఏ సరసహృదయమో !

నీ రాక కోసమై నీ పాట కోసమై

ఇంత కాలముదాక - ఎదురు తెన్నులు చూచె

(సీతారామ లక్ష్మణులు - ఒడ్డు చేరుకుంటారు)

లక్ష్మ: అన్నయ్యా, ఇదేమిటి? మీరు మూటలు మోయుచున్నా రేమిటి?

అపచారం - అపచారం - ఇట్లా యివ్వండి.

సీత: అయ్యో, ఆర్యపుత్రులు నా చీరలు మోస్తున్నారే! ఇట్లా యివ్వండి.

రాము: ఆఁ! ఎంతమార్పు ఇందాక గోదావరి దాటటానికి పూర్వం మీ యిద్దరు నా నెత్తిన పెడితే గతిలేక మూటలు మోస్తున్నా.

లక్ష్మ: ఆఁ! ఆఁ! అన్నయ్యా! నా మనస్సు మబ్బెపోయింది. అదంతా కలవలె స్ఫురణకువచ్చి నా గుండెలు కాలిపోతున్నాయ్. నా శరణా గతిని మన్నించి క్షమించు అన్నయా!

సీత: ఇదేమి రాక్షసమాయో ఆర్యపుత్రా! నేను కూడ పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాను. తారకనాముడు రాముడే కాపాడి నా శరణాగతిని కూడ మన్నించాలి!

లక్ష్మ: అన్నయ్యా! నా పాపానికి నిష్కృతి ఉన్నదా? ఇదుగో! అన్న గారిని ఎదిరించిన ఈపాపి ఇక్కడే ఇప్పుడే చస్తే మంచిది. (కత్తితో పొడుచుకొని ఆత్మహత్య చేసుకోబోతాడు)

శ్రీరా: తమ్ముడూ! ఆగు. అంత సాహసం వద్దు

లక్ష్మ: ఆగను - నేను ఆత్మహత్య చేసుకుంటాను.

శ్రీరా: అలో - లక్ష్మణా! అలో - లక్ష్మణా!

లక్ష్మ: ఓ పంచభూతములారా! ఓ గోదావరీ మహానదీ! ఓ సమస్తదిక్పాలకుల్లారా ! జంతువులారా! చెట్లూ, పుట్టలూ, పుట్టిన పుట్టబోయే మానవులారా! వినండి నా ప్రతిజ్ఞ, ఇదిగో నా పాపం నశించటానికి ఆత్మహత్య చేసుకుంటున్నాను

(నారదుడు ప్రత్యక్షం అవుతాడు)

నారదుడు: ఆగు లక్ష్మణా ఆగు. పాపం శాంతించుగాక! ఇదేమి లక్ష్మణా! (అందరు నమస్కరిస్తారు నారద మహర్షికి.)

శ్రీరా: దే వ ర్షీ ! మా తమ్ముడు....

నార: ఆగు; నాకు చెప్పనక్కరలేదు. నేను నారద మహర్షిని! త్రికాలవేదియైన భారతీయ దేవఋషిని! నాకు సమస్తం తెలుసు. లక్ష్మణా! సర్వ పాపాలు నశించటానికి తారక మంత్రం ఉండనే ఉన్నది. పాపం చేసి పశ్చాత్తాపంతో ఆత్మహత్య చేసుకోనక్కరలేదు - తారక నాముడు రాముడు పుట్టిన తర్వాత! రామనామం అన్ని పాపాలకు విరుగుడు. రామభజన చెయ్యి - నీ పాపం - పోతుంది. ఎన్ని పాపాలు చేసినా - రామనామ స్మరణ చేస్తే ఏమీ పరవాలేదు.

రఘుపతి రాఘవ రాజారాం

పతిత పావన సీతారాం

సుందర విగ్రహ మేఘశ్యాం

గంగా తులసీ సాలగ్రాం.

శ్రీరా: మదీయ నామ సంస్మరణంతో సమస్త పాపాలూ పటాపంచలై పోతాయి! దేముణ్ణి-అయినా నా భార్యా తమ్ముడూ నన్ను ఎదిరించటం ఎందుకు వచ్చిందో లోక సంగ్రహార్థ మీ నోట వినాలని ఉన్నది.

లక్ష్మ: అప్పటికిగాని నాకు మనశ్శాంతి ఉండదు.

నార: వినరా భారత వీర కుమారా

విజయము నీదేరా ||వినరా ||

అన్నను ఎదిర్చిన అద్భుత కథను

గడ్డ మహత్వ మని కానర తనయా

తందానో తాని తందానా

లక్ష్మ: అయ్యా, పద్యంలో కాకుండా వచనంలో చెప్పేస్తేనే గాని అర్థం కాదు నాకు.

నార : నాయనా! ఆగు ; తొందరపడకు, బుర్రకథలో పాట మాటు పెట్టి వచనంలోనే అసలు కథ చెప్పుతాం! లోకోత్తర పురుషుడైన రఘు రాముణ్ణి ఎదిరించటం అనుగు తమ్ముడైన లక్ష్మణుని తప్పుగాదు. ఇప్పుడు మీరు కృష్ణా గోదావరీ మధ్యప్రదేశంలో ఉన్నారు. ఇది గడ్డ మాహాత్మ్యం! ఈక్షేత్ర మహత్వం చాలా గొప్పది, ముందు ముందు కలియుగంలో ఇరవైయ్యో శతాబ్దిలో గాని ఇది పూర్తిగా అందరకు తెలియదు. గోదావరి నీటిలో, తెలుగు గాలిలో, ఈ గడ్డలో ఆ మహాత్వం, ఈ గొప్పతనం ఉంది. ఇక్కడి గోదావరి నీళ్ళు గ్రుక్కెడు గ్రోలితే, తెలుగుగాలి ఒక సారి

పీల్చిపారేస్తే, ఆంధ్ర భూమిమీద అరికాలు మోపితే అన్నగారినేగాదు అపరవిష్ణువునైనా ఎదిరించగల ధైర్య సాహసాలు అప్పటికప్పుడు అద్భుతంగా పుట్టుకొని వచ్చేస్తాయి.

సీత: అయితే నా మరది పశ్చాత్తాపంతో ఆత్మహత్యకు ఎందుకు పూనుకున్నాడు స్వామీ?

నార: అదే ఈ గడ్డలోని విశేషం. ఇక్కడుండే వాళ్ళు మొదట ఇతరులను చంపటానికుద్యమంచి, చివరకు తమ్ము చంపుకోటానికి పూనుకుంటారు! ఇక్కడి ఆంధ్ర ప్రజలకు ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ!

మింటి దుక్కలదర – మిరుమిట్లతో వేల్గి
చివర తుస్సుమనును - చిచ్చుబుడ్డి
ఆంధ్రు లెల్ల అట్టి ఆరంభశూరులే
విశ్వదాభిరామ వినుర వేమ

లక్ష్మ: ఇక్కడకు ప్రవాసిగా వచ్చి నాలుగునాళ్ళుంటేనే నేను ఇట్లాగ తయారయ్యానే - ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి, ఈనీరు త్రాగి, ఈ గాలి పీల్చేసేవాళ్ళ మాట చెప్పాలా? అన్నయ్యా! భ్రాతృ వత్సలా! నా పాపానికి విరుగుడు చెప్పు.

శ్రీరా: ఈశ్వర ప్రతిష్ఠ - సర్వ పాపాలకు విరుగుడు. గుడి కట్టిస్తే ఎంత పాపం చేసినా ఫరవా లేదు.

లక్ష్మ: అయితే ఈ గోదావరీ తీరాన ఈశ్వర ప్రతిష్ఠ చేస్తాను.

శ్రీరా: ఆది లక్ష్మణేశ్వరం అనే పుణ్యక్షేత్రంగా కలియుగంలో యుగ యుగాలుగా నీ పేరు రూపొందుతుంది. కలియుగంలో నీవు ఆంధ్రుడనే మహాఋషిగా పుట్టి, కృష్ణా గోదావరీ మధ్యదేశంలో తపస్సుచేస్తావు. ఆ తపస్సు ఫలించి ఆంధ్రరాష్ట్రం వచ్చేస్తుంది.

సీత: నా పాపానికి విముక్తి లేదా మహాఋషివృషభా !

రాము: మదీయ దివ్య నామస్మరణే అన్ని పాపాలకు ఝుంఝూమారుతం.

అందరు:

రఘుపతి రాఘవ రాజారాం
పతిత పావన సీతారాం
ఈశ్వర అల్లా తేరే నాం
సబ్కో సన్మతి దే భగవాన్.

# ద్వితీయ దృశ్యం

స్థలం: స్వర్గలోకం దేవేంద్రుడు అంతఃపురంలో బృహస్పతితో కూర్చుంటాడు. ఊర్వశి నృత్యం చేస్తూఉంటుంది.

ఊర్వశి: ఆటతాళం : సౌరాష్ట్ర -

కోడికూసె నయ్యయ్యో నా గుండె ఝల్లు ఝల్లు మనెనే
చేడెరో నా సామివద్ద చేరి మాట్లాడేటంతలో ||కో||
చెలువుని యెదురేగి చెలగించి తోడి తెచ్చి
కలపము మైనిండ కస్తూరి నామము పెట్టి
కలువల రేనితో కలహము ముగియించి
చలువ చప్పరములో మేము సరసమాడేటంతలో ||కో||

నారదుడు: (ప్రవేశించి) ఏమయ్యో దేవేంద్రా! ఏమిటికులుకుతున్నావు? కాలం మారిపోతూంటే – కన్నులు కనిపించకుండా ఇంద్రభోగాలతో ఇదేమిటి?

దేవేం: స్వాగతం! స్వాగతం! నారదమహర్షికి, నీవు చిరంజీవివి, సర్వ కాలాల్లో, సర్వస్థలాల్లో నీవుగాని, నీ ప్రతినిధులుగాని, నీ ప్రతిభగాని, నీ అంశ, పంచుకొని పుట్టినవారుగాని ఉండితీరుతారు

నార: నిజమే, భూలోకంలో మనం లేని నాటకం ఆడరు. సినీమా తీయరు. ఎందరో నా పాత్రను అతిసమర్థతతో నన్నుమించి ఎవరికీ తెలియకుండా అభినయిస్తూ ఉండగలరనుకుంటాను. భూలోకంలో మనకు శిష్యులు కోటాను కోట్లు!

దేవేం: ఊరక రారు మహాత్ములు! ఎవరి బట్టతలకు ఎవరి మోకాళ్ళకు ముడి వేయటానికి వచ్చావయ్యా? మాయదారి జిత్తుల మహర్షీ!

నార: అయితే పోతాను

దేవేం: ఆఁ! ఆగు. నీవు లేకపోతే నాటకం రక్తికట్టేదెట్లా? ఏదో చెప్పుబాబూ!

నార: భూలోకంలో కృష్ణాగోదావరీ మధ్య ప్రదేశంలో ఇద్దరు ఋషులు తపస్సు చేస్తున్నారు. భూలోకంలో చక్రవర్తుల యుగం నశించి ప్రజాస్వామ్యయుగం వచ్చింది. ఇక స్వర్గలోకంలోకూడా కాచుకో - ఎన్నికలు పెట్టేస్తారు, జాగ్రత్త!

దేవేం: అయితే ఎన్నికల కిటుకులు మీకు తెలిసిఉంటే ఏదో విజయానికి అడ్డదారులు ఉపదేశింప ప్రార్థన.

నార: దీనసేవ చేయు దేశభక్తు డొకండు

బక్క చిక్కు పేద వాని గాంచి

ఎన్నికలకు ముందు - ఎక్కెక్కి ఏడ్చెరా

విశ్వదాభిరామ వినుర వేష

దేవేం: ఆ ఋషులు ఎన్నికలను ఎందుకు వదలిపెట్టారు.

నార: ఎన్నికలలో కారణాంతరాలవల్ల రాణించని ఇద్దరు మహాఋషులు దండకారణ్యంలో ఆంధ్ర తపోమహావనం స్థాపించారు! తపస్సు చేస్తున్నారు. ఎన్నికలు - గిన్నికలు తరువాత మాట. చూడు, ఆ తపోగ్ని ఎట్లా పొగలు కమ్ముకొనిపోతోందో!

మరో ప్రపంచం! మరో ప్రపంచం! వెలిగిందీ!

కనరా! కనవా! మరో ప్రపంచం!

భుగభుగలూ! ధగధగలూ! భగభగలూ!

ధుగధుగలూ! తుకతుకులూ! వికవిక లూ!

పక పక లు! ॥మరో ప్ర॥

దేవే: ఆఁ నిజమే! నా పదవికేనా భంగం? నా పదవిని చచ్చినా వదలి పెట్టను. నా పదవిని ఎవరు కోరినా వారిని దుంప నాశనం చేసేస్తాను. చూడు, ఊర్వశీ! నీవు పోయి ఆ ఋషులముందు నీ సౌందర్య విలాస విభ్రమాలు ప్రదర్శించి వాళ్ళని చిత్తుచేసి రావాలి! చూడు, కామినీ కాంచనాలకు లొంగనివాళ్ళు భూ ప్రపంచంలో లేరు. భూలోకంలో ఆడదాని కొంగుగాలి ఊపిరితిత్తులలోకి వెడితే ఉక్కిరిబిక్కిరి గాని మగవాడు ఒకడూ ఉండడు.

నార: నిజమే. ఎంత నేర్చినా - ఎంతజూచినా!

ఎంతవారలైనా కాంత దాసులే.

ఊర్వశీ: చిత్తం! ఋషులు జితేంద్రియులు కదా!

దేవేం: అవి పుస్తకాల్లో వ్రాసి ఉన్న మాటలు! అదీగాక, ఇదివరకు నీ చేతిలో ఎంతమంది ఋషులు కీలుబొమ్మలు కాలేదు? నీ వాలు చూపులకు—తమ గుండె సవ్వడులను - శ్రుతి గల్పుకోలేదు?

ఆడ బ్రతుకే మధురం! మధురం!

వల్లెవాటున అల్లిబిల్లిగ

ఉన్న అందము ఎక్కడున్నది.

కండువాలో...

ఈ క్రొత్తపాట పాడితే ఆ ఋషులు కరిగి కరిగి ఐస్ క్రీమైపోతారు.

ఊర్వశీ : సరే; గురువుగారైన బృహస్పతిగారు నాకు శ్రుతి వేయటానికి ఉంటే వెళ్ళి ప్రయత్నిస్తాను.

దేవేం: సరే! దేవమంత్రి, గురువు, మహాకవి, శాస్త్రవేత్త అయిన బృహస్పతి నీకు శ్రుతివేయటానికి వస్తారు. ఏమి గురుదేవా! చెమికీ లాంటి అడపిల్ల దొరికితే వెంటబెట్టుకుని హుషారుగా భూలోకం టూర్ చేసి రావటానికి మీకు అభ్యంతరం ఏముంటుంది?

బృహ: ప్రభూ! నేను గురుదేవుడనూ; సమస్తశాస్త్ర పారంగతుడనూ. నేను యీ ఊర్వశి నాట్యం చేస్తూ పాడుతుంటే బహిరంగంగా ప్రక్క వాద్యం వాయించనా? ఇది నీకు న్యాయమా? ఓ అహల్యా జారా!

దేవే: మరి నా పదవి ఎట్లాగో నిలిస్తేగా నీ పదవి!...

నార: అదీగాక ఆ ఋషులు కృష్ణా గోదావరీ మధ్యతీరస్థులు. ఒకడు ఆంధ్రుడు! మరొకడు విశాలాంధ్రుడు. ప్రతి ముగ్గురాంధ్రుల్లో ఒకడు రాజకీయవేత్త, ఒకడు – కవి, ఒకడు పిచ్చివాడు అన్నారు విజ్ఞులు. వాళ్ళిద్దర్లో ఒకడు దేవేంద్ర పదవి కావాలంటే, మరొకడు దివిజకవి పదవిని కోరుకుంటాడు. అప్పుడు బృహస్పతి పదవికే ముప్పు రావచ్చు - ఏం బృహస్పతీ! జాగ్రత్త, బహుపరాక్!

బృహ: నా పదవికే ముప్పా! అయ్యో! అయితే పద ఊర్వశీ! నేనూ వస్తాను. ఆ భడవులు, పుంఢాకోరులు, ఏమని తపస్సు చేస్తున్నారో!

నార: ఊర్వశీ! జాగ్రత్త, ఆంధ్రదేశానికి వెళ్లుతున్నావు, తెలుగు గాలి ఊపిరితిత్తులలోకి వెడితే ఊర్వశి గీర్వశి అయిపోతుంది. అదుగో! విను! వీరాంధ్ర విజయదుందుభి ఘోష. నీకు దివ్యదృష్టి, దూర శ్రవణం ప్రసాదించాను.

(తెర పై మ్యాజికు లాంతరు బొమ్మలు-వెనుక పాట)

ఆజంతా గుహాంతరాలు!

చిత్రకళాపరిషత్తుగ!

విశ్వశిల్పమకుటోజ్వల

మాణిక్యము చేసినారు!

మావాళ్ళే! మావాళ్ళే!

మా పూర్వికులే!

తెలియనివాళ్ళంతా తెలిసికోండి॥

లేపాక్షి బసవయ్యను విజయనగర విరూపాక్ష

దేవాలయకు కుడ్యాలను-కాళహస్తి వేయికాళ్ళ

మండపాలు-వేలకొలది గోపురాలు-సింహాచల

నల్లరాతి కట్టడాలు—అమరావతి-నాగార్జున

భట్టి ప్రోలు—ధాన్యకటక స్థూపాలూ-చైత్యాలూ

కొండవీడు-కొండపల్లి—గుత్తి -ఉదయగిరి

స్థలదుర్గము-జలదుర్గ ము- గిరి దుర్గము లెన్నెన్నో

మావాళ్ళే కట్టారూ! మా తాతలు సేతులు త్రా

గారండీ! మా మూతులు వాసన చూడగ రారండీ!

తెర

## తృతీయ దృశ్యము

స్థలము: కృష్ణా గోదావరీ మధ్యప్రదేశం

ఇద్దరు ఋషులు - ఆంధ్రుడు, విశాలాంధ్రుడు తపస్సు చేసుకుంటూవుంటారు.

ఆంధ్రుడు: కలియుగే, ప్రథమపాదే, జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే...

విశాలాంధ్రుడు: భరతవర్షే, భరతఖండే, కృష్ణాగోదావర్యోర్మధ్యదేశే, శ్రీశైలస్య ఈశాన్యప్రదేశే, మేరోర్దక్షిణ దిగ్భాగే, దండకారణ్యే, క్రీస్తుశకే, 1958 సంవత్సరే, అక్టోబరు మొదటిదినే మహాతపం కరిష్యే. (పొగలు)

(ఊర్వశి-బృహస్పతి ప్రవేశం)

ఊర్వశి నాట్యంచేస్తూ ఉంటుంది. బృహస్పతి సూటు బూటు, నెక్ టయి, మెడలో హార్మోనియం నవారుబద్దెతో.

బృహ: ఊర్వశీ; పాడు.

ఊర్వశి: గురుదేవా! పాడలేకుండా ఉన్నాను.

బృహ: పోనీలే, నాట్యంచెయ్యి - చేతులు త్రిప్పు - పెదవి కదల్చు. నేను పాటపాడుతానులే. ఇది భూలోకంలో ప్లేబాక్ అనే పేరుతో వెలుస్తుందిలే. చూచే మూర్ఖులు పెదవులు కదిపే మనిషే పాడుతోందను కుంటారని తెలవిగల వాళ్లు ఊహిస్తారు.

ఊర్వశి:

రాయిలో రాయినై! రప్పలో రప్పనై
గుట్టలో గుట్టనై ! చలి చీమ పుట్టనై!
ఈ కొండ కలిసిపోనా!
ఈ కోన దాగిపోనా!
ఎండమావులలోని నీరెండ వెలుగునై!
కలలోని ప్రియురాలి కన్నీటి కెరటమై!
నా పెర్రి పాడుకోనా!
నా బుర్ర చాటుకోనా!
కన్నె కిన్నెరసాని నూనూగు మీసమై !
ఎంకి సతి నిట్టూర్పు ఎనకాల తుమ్ముమై!

తెలుగులో కలిసిపోనా

తెగులుతో మాసిపోనా,

-విష్ణువు ప్రత్యక్షం—

విష్ణువు: ఇదేమిటి బృహస్పతీ! నా భక్తుల తపస్సు చెఱపటానికి ఊర్వశిని వెంట వేసుకు వచ్చావు? వీళ్లెవరో తెలుసా?

బృహ: ఆః, తెలియకేం? ఆంధ్రుడు, విశాలాంధ్రుడు' మొగం చూడగానే తెలిసిపోవటం లేదూ!

విష్ణువు: అవును, నేను రామావతారంలో ఈ కృష్ణాగోదావరి మధ్యనున్న గడ్డమహత్వం తెలుసుకోగలిగాను. కృతయుగంలో ఈ ఆంధ్రుడు నా తమ్ముడైన లక్ష్మణుడే. విశాలాంధ్రుడు అంతకంటె గొప్పవాడై యుండాలి. వీళ్లు బృహస్పతిని గ్రిహస్పతిని లెక్క సెయ్యరు. ఊర్వశికీ రంభకూ లొంగరు. అదీగాక నీవంటి బుద్ధిమంతుడు నా భక్తుల తపస్సు పాడుచెయ్యటమే!

బృహ: మీ భక్తులా ! వీళ్లు విష్ణుదేవుని కూడా లెక్క సెయ్యరని నారద మహర్షి నాకు చెప్పాడే!

విష్ణు: ఛీ! దుర్మదాంధుడా! నీ పదవికోసం, మీ దేవేంద్రుని పదవికోసం మహాఋషులు తపస్సు పాడుచెయ్యటానికి ఊర్వశిని వెంటవేసుకు వచ్చావా? అసూయావృతా' మీరు భూలోకములో పుట్టుదురుగాక!

బృహ: హా! దేవేంద్రా! నాకు ఎంత గతిపట్టినది!

ఊర్వశి: మహావిష్ణూ! నీవు దయామయుడవు, మమ్మల్ని కరుణించు.

విష్ణ: నామాటకు తిరుగులేదు. నీవు పురాణాలు, భారత భాగవతాలు చదవలేదా? శాపం అంటే మజాకా అనుకుంటున్నావా? మదీయ వచనం బమోఘంబని ఎరుంగవో? మూఢాత్ములారా!

బృహ: మహావిష్ణూ! ఇది నాకు సొంతంగా పుట్టిన బుద్ధికాదు; ఇంద్రుడు వెళ్ళమంటే తప్పనిసరిగా వచ్చేశాను. నా అంతట నన్ను వదలి పెడితే ఎప్పుడూ మంచిపనులే చేస్తాను.

విష్ణు: ఏం లాభంలేదు. శాపం అనుభవించి తీరాలి. ఇది శాపం! వంకాయల బేరం లేక వాతావరణ సూచన అను కుంటున్నారా??

బృహ: అయితే నేను సమస్త శాస్త్ర పారంగతుణ్ణి, స్వర్గలోకంలో అందరి చేతా నమస్కారాలు పొందుతూ తలెత్తుకు తిరిగినవాణ్ణి, దయ ఉంచి భూలోకంలో నా చదువుకూ, గుణగణాలకు తగినపదవి ప్రసాదించు ప్రభూ!

విష్ణు: నీవు భూలోకంలో కలియుగంలో కమిటీ కాలేజీలో ప్రిన్సిపాల్ అవుతావు పో ' ఇదిగో ఊర్వశీ! నీ రూపానికి, నీ ఆటపాటలకు తగిన పుట్టుక నీవు సినీమా తారామణిపై ఉద్భవిస్తావు.

ఊర్వశి: మహాప్రభూ! నాకు భూలోకంలో ఇల్లాలిగా ఉండాలని ఉంది.

విష్ణు: కృష్ణావతారంలో నాకు పదారువేల భార్యలున్నా నేను బ్రహ్మ చారినే! ఏం పరవాలేదు నీవు వెండితెర పై తార పై పుట్టి నలుబది యేళ్లు మళ్ళిన తరువాత పెళ్ళి చేసుకొని ఇల్లాలివే అవుతావు. అంతకు ముందు ఎట్టి పరిస్థితులలోను నీ కన్యాత్వంబు దూషి తంబు గాకుండ వరంబొసంగితి పొమ్ము.

-బృహస్పతి, ఊర్వశి నిష్క్రమణ -

ఆంధ్రు: (కన్నులు మూసి) ఆపద్బాంధవా! జగద్రక్షకా! రాధికాజారా! గోపికావిటా!

లోకములోన కొందరబలుల్ సతులన్ దనియింపలేక ఆ
స్తోక మనీష అన్యపురుషుల్ తమ కాంతల నంటకుండ తా
టాకులలోన వ్రాసిరి పరాంగన గూడుట పాపమంచు ఆ
ఆకులపాటు జూచి ఇపు డాకులపా టనయంగ నేటికిన్! 1

జై శ్రీమద్రమారమణగోవిందో హరి!

విశా: (తనలో) ఈ డెల్టా ఆంధ్రుడు రాయలసీమకని వ్రాసిన పద్యం చదవటంలేదు. నేను చదివెదనుగాక!

టీజనితేన్స్పిరేషను పటిష్ఠ మహీయ గవాయి గాన వి
ద్యాజితపీరుసాబు: నయనాంచిత గోల్డెను స్పెక్టికల్ ద్వయీ
భ్రాజిత డాబు! బూతుల షరాబు! కవిత్వఖరాబు నాట్యపుం
బోజులలో నవాబు - పొగపూతల మింటి గిలాబు బాబయా. 2

విష్ణు: నేను శ్రీమన్ మహావిష్ణువును. మీరు కోరిన వరంబు లిచ్చెదను, తపోదీక్ష విరమించుడు (తనలో) ఏమీ వీరి ఉగ్ర తపస్సు! నేను ప్రత్యక్షమైనను గమనించకున్నారే! ఏమి చేయునును? (అంధ్రుని దగ్గరకు వచ్చి తలపట్టుకొని ఊపి) ఇదిగో ప్రత్యక్ష మైతిని. లెమ్ము వత్సా! లెమ్ము, నిన్ను కరుణించితిని.

అంధ్రు: హల్లో! మైడియర్ విష్ణుమూర్తిగారూ! తమరేనా ప్రత్యక్షమైంది. దయచెయ్యండి, అనుకుంటూనే ఉన్నానులెండి, వచ్చావా! మహాను భావా! ఆపద్ బాంధవా! శ్రీమన్ మహావిష్ణుమూర్తిగారూ!

---

1. తారాళ కాంకము - సాలటూర్ గారి పద్యము.

విష్ణు: నీకేం కావాలి? రామపాదసాగర ప్రాజెక్టా? నందికొండ? సిద్దేశ్వరం? పులిచింతల? విశాలాంధ్రరాష్ట్రం? చెన్నపట్నం? హైదరాబాదు- ఏం కావాలి?

ఆంధ్రు: ఇదిగో, చెన్నపట్నం కర్నూలు కాకపోతే నీ వైకుంఠమునే అవసరమైతే ఆంధ్ర రాజధాని చేసుకుంటాం. అవునుగాని, విశాలాంధ్రుడికి ఏమికావాలో అడిగారా శ్రీమన్ మహావిష్ణువుంగారూ?

విష్ణు: లేదు.

ఆంధ్రు: ఆలా అయితే-బభ్రాజిమానం ఇక్కడి కెందుకు వచ్చారండీ? ముందు విశాలాంధ్రుడి దగ్గరకు వెళ్ళండి. నాకేం కోరికలు లేవఁడీ ! అసలు సిసలైన ఆంధ్రుడు-నిర్లిప్తుడు, నిష్కాముడు, నిర్నిద్రుడు, నిరీహుడు, నిస్స్వార్థుడు అని ఎరుగవుటయ్యా? పో! పోవయ్యా! ఇంకా పోవేమయ్యా' పోయి-విశాలాంధ్రుణ్ణి కనుక్కో, పోరా! పో! ఇంకా వెళ్ళవేమిటిరా? చెబుతున్నా వినవేం? నీకు చెముడేమిటిరా?

విష్ణు : (తనలో) ఈ ఆంధ్రుడు బలేవాడే! - ఏమండీతో ఆరంభించి క్షణంలో లోకువ గట్టి ఏరా అనేశాడు. నన్ను తిట్లతో వదలినాడు ఆంధ్రుడు — ఈ విశాలాంధ్రుడు కొట్టుతాడేమో. అయినను ప్రత్యక్షమైన తరువాత వరంబులివ్వక తప్పదుగదా! (ప్రకాశముగా) ఓయి విశాలాంధ్రుడా! లే లెమ్ము- వత్సా! కరుణించితిని. నీ కోరికలు కోరుకో! నీ కేం కావాలి?

విశా : ఆ నంగనాచి నయగారాలు. ముందు ఆంధ్రుడికే ప్రత్యక్ష మయ్యావుగా! అతని కేమిచ్చావు? దాన్నిబట్టి కోరుకోవాలి! చెప్పరా! చెప్పు! సిగ్గుపడకురా! నేనేం కళ్ళుమూసుకొని చూడటం లేదను కున్నావుట్రా!!

విష్ణు : ఆ ఆంధ్రుడు నీదగ్గరకు వెళ్ళమన్నాడు.

విశా : నే నేం వెట్టి వెంగళప్ప ననుకుంటున్నావేం, పో! ఆంధ్రుడి దగ్గరకు ముందువెళ్ళావుగా, పో! అతన్నే అడుగు. ఆదీగాక విశాలాంధ్రుడికి ఏమీ కోరికలుండవు. అసలు విషయం తెలిసిందా? పో, ఆంధ్రుడి దగ్గరకే పో. వెళ్ళి రారా! అది అంతా ఉందిలేరా! వెడతావా! వెళ్లవా! ఇదుగో నా దండంతో నీకిరీటాన్ని ..

విష్ణువు: (తప్పించుకొని) ఓయీ ఆంధ్రా! నీవు కోరుకో, తెలిసిందా ? లేక పోతే ఇంక నేను వెళ్ళిపోతాను. ఆంధ్రుడూ, విశాలాంధ్రుడి మధ్య భగవంతుడుకూడ నలిగిపోయి చచ్చిపోతున్నాడే

ఆంధ్రు : అయితే ఇక కోరుకోటం తప్ప దంటావా? లోపాయికారీగా చెప్పు- నేను విశాలాంధ్రుడితో చెప్పనులేరా!

విష్ణు: కోరుకో, కోరుకుంటావా లేదా? ఇదుగో, ఒకటి... రెండు...

ఆంధ్రు: అగు, - విశాలాంధ్రుడు ఏది కోరితే నాకు-దానికి-'డబుల్' అంటే రెట్టింపు కలగాలి, తెలిసిందా.

విష్ణు: అయితే నీవు కోరిన వరం ఇచ్చాను. (అటు తిరిగి) -ఓయీ విశాలాంధ్రా! నీవు కోరుకో.

విశా: అఁ వింటున్నాం మా ఆంధ్రుడు కోరిన కోరిక, వాడే తెలివిగల వాడు అని వాడి ఉద్దేశం. సరే, కోరుకుంటున్నా, కాచుకో,

విష్ణు: కోరుకో!

విశా : అయితే నాకు ఒక కన్నుపోయేటట్లు దయతో వరం ప్రసాదించు. నాకు ఒక కన్నుపొతే పోయింది, మా ఆంధ్రుడికి రెండుకళ్ళూ పోయాయనే సంతోషం లభి స్తే నాకు...

విష్ణు: బాగుంది, ఇందుకోసమా మీ యిద్దరి తపస్సు! మీరు ఇరవయ్యో శతాబ్దిలో ఆంధ్రదేశంలో రాజకీయ నాయకులై పుట్టుదురుగాక! ఆంధ్రరాష్ట్రం వచ్చినపుడు మీ కోరికలు ఈడేరుగాక !

విశా: నాకు ఒక కన్నుపోయిందనే విచారంకంటె మా ఆంధ్రుడికి రెండు కళ్ళూ పోయాయనే సంతోషం ఎక్కువవుతోంది. కొంపదీసి ఎప్పటికయినా మే మిద్దరం కలుస్తామా!

విష్ణు: ఆంధ్రుల గొప్పతనం ఇంకా నాకు బోధపడలేదు. ఆ మహోదయం కోసం ఎదురుచూస్తూ ఈ దండకారణ్యంలో తపస్సుచేయండి.

(విశాలాంధ్రుడు ఆంధ్రుని చేయిపుచ్చుకొని పాడుతూ నిష్క్రమణం)

విశా: ఒక కన్ను లేదు నారాయణా!

ఆంధ్రు : ఒక్కకన్నూ లేదు నారాయణా!

విశా - ఆంధ్రు: కన్నులుండీ చూడలేదు నారాయణా!

కనులులేకా చూడవచ్చు నారాయణా!

అయ్యా, ధర్మం బాబూ ధర్మం.

తెర